క్లుప్తంగా

ఆంజనేయస్వామికి వెండిమాల విరాళం


వెండి మాల అందజేస్తున్న మోహన్‌రావు

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరులో వెలసిన ఎనకండ్ల ఆంజనేయస్వామికి గ్రామానికి చెందిన మోహన్‌రావు సుమారు రూ.15 వేల విలువ వెండిమాలను విరాళంగా అందజేసినట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. దాతను జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మనంద ఆచారి అభినందించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కేశ వెంకటసుబ్బయ్యగౌడ్, మహేష్, ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత


ఫీజు చెల్లించిన రసీదులు అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

డోన్ టౌన్ : గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చాకలి గిరిబాబు కుటుంబానికి ద్రోణాచలం సేవా సమితి సభ్యులు అండగా నిలిచారు. మృతుడి పిల్లల విద్యకు సంబంధించి రెండోఏడాది సైతం ఫీజులు చెల్లించి చేయూనిచ్చారు. పట్టణానికి చెందిన బచ్చు నాగరాజు రూ.10 వేల సహాయాన్ని అందించగా పిల్లల ఫీజులు చెల్లించి బుధవారం సంబంధిత రసీదులు మృతుడి భార్యకు సమితి సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ద్రోణాచలం సేవా సమితి సభ్యులు షాదిఖానా రాజు, పానిపూరి మురళీ, ఫొటోగ్రాఫర్ బాబా, సిద్ధూ, యాసిర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కోవెలకుంట్ల: నూతనంగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ఎస్ఎం షరీఫ్ డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల విలీనానికి సంబంధించిన 117 జీఓను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మీడియంలో విద్యాబోధన కొనసాగించాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలన్నారు.

డైరెక్టర్ పదవికి రాజీనామా

కోవెలకుంట్ల: ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి గ్రామానికి చెందిన ఇట్టె కరుణాకర్ బుధవారం రాజీనామా చేశారు. 2023 ఏప్రిల్ 21 నుంచి ఆయన ఆ పదవిలో కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలు కావడంతో పదవికి రాజీనామా చేశారు. అటవీశాఖ చీఫ్ సెక్రటరీకి రాజీనామా లేఖను ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు పేర్కొన్నారు.

రైతులు ఆర్బీకేలో సంప్రదించండి

బేతంచెర్ల: 2023 ఖరీఫ్‌లో కరువు జాబితాలో పేరు ఉండి ఇంకా డబ్బులు జమకాని రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రంలో ఉంచడం జరిగిందని ఏఓ కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఇంత వరకు ఇవ్వని రైతులు, ఆధార్ లింక్ లేని రైతులు వెంటనే ఆర్బీకేలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లను జూన్ 14వ తేదీలోగా అందజేయాలన్నారు.

22న లక్ష్మీ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన వెలసిన చౌడేశ్వరీ దేవి నూతన కల్యాణ మండపంలో ఈనెల 22న లక్ష్మీ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జ్యేష్ఠ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ఈ కల్యాణ మహోత్సవానికి భక్తులు తరలివచ్చి స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.

సంతృప్త స్థాయిలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

నంద్యాల(సెంట్రల్): నంద్యాల సబ్‌డివిజన్‌లో అన్నదాతలకు సంతృప్త స్థాయిలో పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఖరీఫ్‌నకు సంబంధించి మొత్తం 6 మండలాలకు గాను అదనపు కేటాయింపులతో కలిపి 1377 క్వింటాళ్ల జీలుగ, 200 క్వింటాళ్ల పిల్లి పెసరను పంపిణీ చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నమోదు చేసుకున్న అన్నదాతలకందరికీ 50 శాతం రాయితీతో అందజేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా విత్తనాల నాణ్యతలో లోపాలుంటే స్థానిక వ్యవసాయ సహాయకులకు తెలియజేసి మార్చుకునే అవకాశం కల్పించామన్నారు.

- నేటి నుంచి పాఠశాలలు పున:ప్రారంభం
- స్టాక్ పాయింట్లలో పాఠ్య పుస్తకాలు
- మోగనున్న బడి గంటలు

బడికి వేళాయె



కొలిమిగుండ్ల: బడి గంటలు గురువారం మోగనున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలల పున:ప్రారంభానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు పాఠశాలలను సిద్ధం చేశారు ప్రధానోపాధ్యాయులు. సెలవుల్లో ఆట పాటలతో ఉత్సాహంగా గడిపిన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందించినప్పుడే సమ సమాజం ఏర్పడుతుందని భావించిన గత ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను రూపురేఖలు మార్చేసింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మౌలిక వసతులు కల్పించింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఐదేళ్లపాటు పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక పేరుతో పుస్తకాలు, యూనిఫారం, బ్యాగులు, షూష్, బెల్ట్‌లు అందించింది. ఈ నేపథ్యంలో విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో ముందుగానే ఉపాధ్యాయులు తరగతి గదులు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడనున్నాయి.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్‌కు చేరాయి. నియోజకవర్గం కేంద్రం బనగానపల్లెతోపాటు కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 321 ఉన్నాయి. దాదాపు 21 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 1–10 వ తరగతి వరకు మంజూరైన పాఠ్య పుస్తకాలను స్టాక్ పాయింట్ల నుంచి వాహనాల్లో ఆయా పాఠశాలలకు చేరవేసే పనిలో ఎమ్మార్సీ సిబ్బంది నిమగ్నమయ్యారు. యూనిఫారం, బ్యాగులు, షూస్, బెల్ట్‌లు ఇంకా రావాల్సి ఉంది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో విద్యాకానుక బదులుగా స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చారు.

నేటి నుంచి విద్యార్థులు బడిబాట

బేతంచెర్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. విద్యార్థులకు విద్యాకానుక అందజేయడానికి ఏర్పాట్లు చేశారు. 1వ తరగతి నుంచి 10వ తర గతి వరకు 7,493 మంది విద్యార్థులకు సంబంధించి 56 ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్ఎంల ఆధ్వర్యంలో విద్యా కానుకు ఆయా పాఠశాలలకు చేరవేస్తు న్నట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. మండలంలో 49 వేల టెక్స్ బుక్స్, నోట్ బుక్స్ వచ్చాయని, ఇంకా 49 వేలు రావాల్సి ఉందని ఎంఈఓ తెలిపారు.

నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

మండలం	ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత	ఉన్నత పాఠశాలలు
బనగానపల్లె	63	10	14
కొలిమిగుండ్ల	54	05	12
కోవెలకుంట్ల	25	09	08
అవుకు	52	08	10
సంజామల	37	05	09

పాఠశాలలకు పుస్తకాలు పంపుతున్నాం



విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో స్టాక్ పాయింట్ నుంచి పాఠ్య, నోట్ పుస్తకాలను నేరుగా వాహనాల్లో పాఠశాలలకు పంపుతున్నాం. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా అన్ని సబ్జెక్ట్‌ల పుస్తకాలు వచ్చాయి. పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో తరగతి గదులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నాం.

– అబ్దుల్ కలాం,ఎంఈఓ.

హత్య కేసు నిందితుల అరెస్ట్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లెలో జరిగిన మంజుల నాగేంద్ర హత్య కేసులో అదే గ్రామానికి చెందిన ముగ్గురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగేంద్ర భార్యతో రామాంజికి వివాహేతర సంబంధం ఉండేది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న కారణంతో ఈనెల 6వ తేదిన నాగేంద్రను డిన్నర్ చేసుకుందామని గ్రామ సమీపంలోని గంగమ్మ గుడి వద్దకు తీసుకు వెళ్లారు. అక్కడే రామాంజి, పెద్దపుల్లయ్య, మనోహర్‌తో కలిసి మద్యం సేవించారు. అనంతరం నాగేంద్ర తలపై రాళ్లతో తీవ్రంగా కొట్టడంతో మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులు బందార్లపల్లె క్రాస్ రోడ్డులోని రాయల్టీ చెక్‌పోస్ట్ సమీపంలో ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నేటి నుంచి తరగతులు ప్రారంభం

బేతంచెర్ల: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి తరగతులు గురువారం నుంచి ప్రారంభవుతాయని, 6వ తరగతిలో సీటు వచ్చిన విద్యార్థులు సర్టిఫికెట్లు వెరిఫై చేయించుకొని హాజరు కావాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు బుధవారం తెలిపారు. అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు తరగతులకు సకాలంలో వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్ : స్థానిక కోర్టు భవనంల ఆవరణలో ఈ నెల 29వ తేది నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. లోక్ అదాలత్‌పై స్థానిక కోర్టులో బుధవారం సాయంత్రం పట్టణంలోని వివిధ బ్యాంక్ మేనేజర్లు, అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బ్యాంకులు, విద్యుత్, టెలిఫోన్ తదితర శాఖల రుణా లు, బిల్లులు తిరిగి చెల్లించని వారిని గుర్తించి లోక్ అదాలత్‌లో ప్రవేశపెట్టి పరిష్కరించుకోవాలని సూ చించారు. బకాయిల వసూలుకు మార్గాలు సుగ మం చేసుకోవాలన్నారు. సమావేశంలో కోర్టు సిబ్బంది సరిత, కల్యాణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

డోన్ టౌన్ : కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుల్లాయప్ప అధ్యక్షతన నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.2లక్షలు ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం డోన్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధక్షుడిగా శివరామ్, అధ్యక్షుడిగా పెద్ద ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కుల్లాయిస్వామి, ఉపాధ్యక్షులుగా గోవిందు, నాగరాజు, సహాయ కార్యదర్శులుగా దేవదానం, ఆవులయ్య, కోశాధికారిగా హైమారావుతో పది మందిని కమిటీ సభ్యులును ఎన్నుకున్నారు.

కుందూనదికి పోటెత్తిన వరద


ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది


సంజామలలో వర్షపునీటితో చెరువును తలపిస్తున్న పంటపొలం

కోవెలకుంట్ల: నైరుతి రుతుపవనాల ప్రభావంతో దాదాపు పది రోజుల నుంచి స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కోవెలకుంట్ల పట్టణ శివారులో ప్రవహిస్తున్న కుందూనదికి వరదనీరు పోటెత్తింది. బుధవారం సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 23.2 మి.మీ., దొర్నిపాడు– 32.6 మి.మీ., కొలిమిగుండ్ల – 16.4 మి.మీ., అవుకు మండలంలో 3.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. భారీ వర్షాలతో కోవెలకుంట్ల పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మోకాటి లోతు నీరు ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు అనుకూలంగా మారటం, కుందూనది, పాలేరు, కుందరవాగు, చెరువుల్లో నీరు పుష్కలంగా చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బనగానపల్లెలో 29.8 మి.మీ వర్షపాతం

బనగానపల్లె : బనగానపల్లె ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసింది. దీంతో 29.8 మి.మీ వర్షపాతంగా నమోదైంది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షం ఖరీఫ్‌లో పంటల సాగుకు ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈ విధమైన వర్షపాతం గత మూడేళ్లలో ఎన్నడూ నమోదు కాలేదని అధికారులు పేర్కొంటున్నారు.

సంజామలలో 47.5 మిమీ వర్షపాతం

సంజామల:మండల కేంద్రం సంజామలతోపాటు గ్రామాలలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు జలమయం అయ్యాయి. పొలాల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో 47.3 మీ.మీ వర్షపాతం నమోదు అయ్యింది.

మూడు రోజులుగా వానలు

డోన్ టౌన్ : మండల కేంద్రం డోన్‌తోపాటు గ్రామాల్లోనూ మూడురోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. జూన్ ఒక్కటవ తేదీ నుంచి వర్షాలు విస్తారంగా కురిశాయి. ఈ నేపథ్యంలో 10వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం నుంచే మోస్తరు వర్షం ప్రతి రోజు ఎడతెరపి లేకుండా కురుస్తుండడంతో పట్టణంతో పాటు గ్రామాలు చిత్తడిగా మారాయి. పంట పొలాలు వర్షపునీటితో కుంటలను తలపిస్తున్నాయి. వ్యవసాయ పనులు, విత్తనం విత్తేందుకు ఇబ్బందిగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డోన్‌లో 11వ తేదీ 23.6మీమీ, 12వ తేదీ 36.8మీమీ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

చామంతి సాగుకు అనుకూలం

- మెలకువలు పాటిస్తే లాభదాయకం
- ఎకరాకు 3 నుంచి 6 టన్నుల పూలు దిగుబడి


పేపర్ కలర్ చామంతి పూల తోట

బేతంచెర్ల : ఖరీఫ్ సీజన్ జూన్ 1ప్రారంభమైంది. సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు కురుస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. లాభాలు కురిపించే చామంతి పూలు సాగుకు ప్రస్తుత పరిస్థితులు అనుకూలం అంటున్నారు వ్యవసాయ అధికారులు. జూన్, జూలై నెలల్లో ఈ పూలు సాగు చేపడితే కలిసి వస్తాయంటున్నారు. బేతంచెర్ల మండల పరిధిలోని సీతారామాపురం, బైనపల్లె, శంకలాపురం, మండ్లవానిపల్లె, రుద్రవరం గ్రామంలో ప్రతియేటా బోరు బావుల కింద ఖరీఫ్‌లో ఎక్కువగా చామంతి పూల సాగు చేస్తారు రైతులు. వివిధ రకాల చామంతిని సాగు చేస్తున్నారు. చామంతిని ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు విజయవాడ, రాజమండ్రి, చెన్నై బెంగళూరు, హైదారాబాద్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్తారు. జూన్– జూలై మాసాలలో నాటిన మొక్కలు డిసెంబర్, జనవరి నెలల వరకు పూత పూసి కోతకు వస్తుంది చామంతి. పంట కాలంలో దాదాపు 6 –8 సార్లు పూలు దిగుబడి అవుతుంది. ఎకరాకు దాదాపు 3 నుంచి 6 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు చామంతి పూల సాగు, సస్యరక్షణ చర్యలపై ఉద్యాన శాఖ అధికారి రఘువరన్ సూచనలు చేశారు.

నేలలు; బాగా నీరు ఇంకే గరక నేలలు చామంతి సాగుకు మిక్కిలి అనుకూల మైనవి. చామంతి సాధారణంగా మొక్కపక్క పిలకలు నాటి పెంచ వచ్చు. పూల కోతలు అయిన తరువాత ఫిబ్రవరి, మార్చి నెలలో ఈ పిలకలు తీసుకోవ. నారుమడిలో ఈ పిలకలను నాటిన తర్వాత పొలంలో నాట వచ్చు.

నాట్లు: ముఖ్యంగా జూన్– జూలై మాసాలు నాటుకు అనుకూలం. నారు మొక్కలను 30 సెం. మీటర్లు దూరం ఉండేలా నాటాలి. ఎకరానికి కనీసం 30వేల నుంచి 40 వేల పిలకలు కావాలి. 8–10 సెంట్ల నారుమడిలో పెంచిన మొక్కలను నుంచి కత్తిరించిన విత్తనపు మొక్కలు హెక్టారుకు సరిపోతాయి.

ఎరువులు: పచ్చిరొట్ట, ఆముదం పిండి, వేపపిండి పశువలఎరువు వేయాలి.

రసాయనికి ఎరువులు: 60 కిలోల భాస్వరాన్ని ఆఖరి దుక్కిలో 375 కిలోల సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేయాలి. 200 కిలోల యూరియా, 120 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను రెండు, మూడు దఫాలుగా వేయడం మంచిది.

హార్మోనుల వాడకం: నాప్తలిన్ ఆసిడ్ అనే హార్మోనును 100 పీపీయమ్(100 మి. గ్రా. లను ఒక లీటర్ నీటిలో కలుపవలెను) మందును మొగ్గ దశ కంటే ముందుగా పిచికారీతో పూత కొంత ఆలస్యం చేయవచ్చు. 100–150 పీపీయమ్ జిబ్బర్లిక్ ఆసిడ్ అనే హార్మోనును పిచికారీతో 15–20 రోజులలో త్వరగా పూతకు వస్తుంది.

సస్య రక్షణ: చామంతి పంటకు ముఖ్యంగా పచ్చపురుగులు, ముడత, ఆకు తొలుచు పురుగు ఎక్కువగా నష్టం కలుగ జేస్తాయి.

పచ్చ పురుగు: ఈ గొంగళి పురుగులు ఆకులను తినివేయడంతోపాటు పువ్వులను కూడా పాడు చేస్తాయి. నివారణకు ఇమిడా క్లోప్రైడ్ ఒక ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదంటే రీజంట్ రెండు ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ముడత: ఇవి గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చి వేస్తాయి. దీంతో ఆకులు ముడతలు పడి ఎండిపోతాయి. పూలు కూడా వాడిపోతాయి. నివారణకు డైమితోయెట్ 30 ఈసీ (రోగార్) ఏక తియోమిటాన్ (ఎకాటిన్) 250 మి.లీ లేదా కార్బరిల్ 50వాతం నీటిలో కరిగెడు పొడిని 600 గ్రాములు ఎకరం వీస్తీర్ణంలో పిచికారీ చేయాలి.

తెగుళ్లు

ఆకుమచ్చ : నల్లటి లోతైన గుండ్రటి మచ్చలు ఆకులపై ఏర్పడడంతో ఎండి వడలిపోతాయి. నివారణకు మంకోజెబ్ 75 డబ్లూయసీ (డైథేన్ ఎం.45) 3 గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.


సాగు చేసిన వివిధ రకాల చామంతి పూలు

కుంకుమ తెగులు : వర్షాకాలం మందు ఈ తెగులు ఎక్కువగా వస్తుంది. ఆకుపై బుడిపై వంటి మచ్చలు ఏర్పడడంతో రాలిపోతాయి. నివారణకు నీటిలో కరుగు గంధకపు పొడి 3 గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

చామంతి పూల సాగు లాభదాయకం



చామంతి పూల సాగు రైతులకు లాభదాయకం. ఉద్యాన సాగు ప్రోత్సాహంలో భాగంగా రైతులకు హెక్టార్‌కు రూ.16 వేల వరకు అందిస్తున్నాం. ఇందు కోసం చామంతి పూలు సాగు చేసిన రైతులు ఆర్బీకేలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. చామంతి పూలుకు మంచి డిమాండ్ ఉంది. వివాహాలు సీజన్‌లో ధర మంచి గిట్టుబాటుగా ఉంటుంది. కేజీ రూ.50 నుంచి 180 వరకు పలుకుతుంది.

– రఘువరన్, ఉద్యాన శాఖ అధికారి

కుమారస్వామికి షష్టి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో బుధవారం షష్టి సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మహానందిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మహానంది : మహానందీశ్వరుడి సన్నిధిలో పల్నాడు జిల్లాకు చెందిన వీరభద్ర భజనమండలి కళాకారులు బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కాకాని అంజయ్య ఆధ్వర్యంలో కళాకారులు భజనలు చేశారు. ఓం నమఃశివాయ, హరహర మహాదేవ లాంటి ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ నిర్వహించిన భజన ప్రదర్శన భక్తులకు ఆధ్యాత్మిక ఆనందానికి గురిచేసింది.

కార్మికులకు వేతనాలు చెల్లించండి


వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల టౌన్: నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు క్రమం తప్పకుండా చెల్లించాలని, అలాగే మార్చి, ఏప్రిల్, మే నెలకు సంబంధించిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయమ్మకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలలు నుంచి జీతాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే ప్రావిడెంట్ ఫండ్, కార్మికుల బీమా చెల్లింపు సక్రమంగా అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టం ప్రకారం వారికి కనీస సౌకర్యాలు, యూనిఫాం, వారాంతపు సెలవు, పండుగ, జాతీయ సెలవులు, 15 వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సుశీలమ్మ, కార్మికులు రాణి,లక్ష్మి, సావిత్రి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాటపై ర్యాలీ


హనుమాన్ నగర్‌లో చిన్నారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

బేతంచెర్ల: అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీ అంగన్‌వాడీ సెంటర్ చిన్నారులు, తల్లులతో కలిసి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కార్యకర్త ఆదిలక్ష్మి సూచించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం అందజేస్తున్నామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం


గంధాన్ని ఉరేగింపుగా తీసుకెళ్తున్న పీఠాధిపతి

చాగలమర్రి: స్థానిక చెరువు కట్టపై వెలసిన దస్తగిరి స్వామి గంధం కార్యక్రమాన్ని దర్గా కమిటీ సభ్యులు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాత బస్టాండు వీధిలోని ముల్లా మౌలాలి ఇంటి నుంచి వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పీఠాధిపతి అబ్దుల్‌హక్ స్వామి వారికి గంధాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా దర్గా వరకు తీసుకెళ్లి, స్వామి వారికి సమర్పించి, ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. శెట్టివీడు, చాగలమర్రికి చెందిన దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కాగా గంధోత్సవానికి భక్తులు భారీగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలలకు కిట్లు పంపిణీ

పాణ్యం: మండలంలోని పది రెసిడెన్షియల్ పాఠశాలలకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తెలిపారు. ఈ కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బెల్ట్‌లు ఉంటాయన్నారు. మిగిలినవి త్వరలోనే వస్తాయని చెప్పారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బెల్ట్, షూతో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.